క్లుప్తంగా

పంటలను కాపాడండి

కల్లూరురూరల్: సాగర్ జలాలను విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో మనుమంటి వెంకటి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం గ్రామ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాలలో వర్షం పడలేదని, గోదావరి జలాలతో పంటలను కాపాడుకోవచ్చుని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, రామనాథం, కంచెపోగు జమలయ్యలు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పుల్లయ్య

కారేపల్లి: ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ లేక గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందటంలేదని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కార్యదర్శి దుగ్గి కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం కారేపల్లి మండలం మాణిక్యారంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జా రమారావు అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఏన్కూర్ కేంద్రంగా ఖమ్మం జిల్లాలో ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేసి గిరిజనుల అభివృద్ధికి బాటలు వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు పోడుసాగు చేస్తున్న వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మాణిక్యారం, ఎర్రబోడు ప్రాంతాల్లో పోడుదారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సీతారాములు, రామచంద్రయ్య, జోగయ్య, రాఘవులు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు విష్ణు, పక్కన నాయకులు

సత్తుపల్లిరూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మా విష్ణు ఆరోపించారు. ఆదివారం సత్తుపల్లి కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్ల యూనియన్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులందరు ఐక్యతతో హక్కులను సాధించుకోవాలని పిలుపు నిచ్చారు. మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్, మోరంపూడి పాండు, శీలం సత్యనారాయణరెడ్డి, జాజిరి శ్రీనివాస్, కొలికపోగు సర్వేశ్వరరావు, ఐ.సనందరావు, సత్యం, రమేష్, మోహన్‌రావు పాల్గొన్నారు.

మిత్రుడికి చేయూత



అర్లప్పకు సరుకులను అందిస్తున్న ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రావు, తోటి మిత్రులు

మధిర: తమతో పాటు చదువుకున్న మిత్రుడికి ఆర్థిక సాయం చేసి తమ స్నేహాన్ని చాటుకున్నారు తోటి మిత్రులు. 1987–89 సంవత్సరంలో మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకున్న అర్లప్ప.. ప్రస్తుతం ఆరోగ్యపరిస్థితి బాగాలేక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకుని తోటి మిత్రులు అందించిన సుమారు రూ.80 వేల విలువగల బియ్యం కొట్టు సరుకులను ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ కర్నాటి రామ్మోహన్‌రావు అందించారు. బోనకల్‌మండలం పెద్దబీరవల్లిలో అప్పర్ల బడ్డీ కొట్టు పెట్టుకునేందుకు సహకరించారు. ముఖ్యంగా మాధవరావు, ప్రకాశ్, రాము, బ్రహ్మంతో పాటు ఇతర మిత్రులు స్పందించి ఆర్థిక సాయం అందించారు. స్నేహితుడికి సహకార మందించిన తోటి స్నేహితులను ప్రిన్సిపాల్ అభినందించారు. అర్లప్ప సంతోషంగా జీవనం సాగించాలని తోటి మిత్రులు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

చింతకాని: మండలంలోని చిన్నమండవ గ్రామంలో ఇటీవల మున్నేరు నీటిలో మునిగి మృతి చెందిన అన్నదమ్ములు కాశిమాల నాగగోపి, నందకిషోర్ కుటుంబసభ్యులకు గ్రామ మాజీ సర్పంచ్ పర్సా రామచందర్‌రావు ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దారెల్లి ఆనందరావు కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు లక్ష్మీనారాయణ, సైదులు, నాగరాజు, కిషోర్, బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో ‘సొసైటీ’..

- నారాయణపురం సొసైటీకి రూ. 25 లక్షల స్థలం వితరణ
- 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మాణం



నూతనంగా నిర్మిస్తున్న గోదాం

బోనకల్: మండలంలోని నారాయణపురం సొసైటీ అభివృద్ధి బాటలో పయనిస్తుంది. సొసైటీలో నారాయణపురం, చిన్నబీరవల్లి గ్రామాలకు చెందిన 850మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ప్రస్తుతం రూ. 4.5 కోట్ల టర్నోవర్‌తో నడుస్తుంది. రైతులు ప్రతి ఏటా రుణాలు తీసుకుంటూ, సకాలంలో చెల్లించి సొసైటీని అభివృద్ధి మార్గంలో పయనించేందుకు సహకరిస్తున్నారు. గ్రామానికి చెందిన బత్తినేని నాగప్రసాదరావు సొసైటీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ తన సొంత ఖర్చుతో రూ.28 లక్షలతో 30కుంటల భూమిని కొనుగోలు చేసి సొసైటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి దాతృత్వం చాటుకున్నాడు.

నేరవేరిన చిరకాల వాంఛ..

ఆ భూమిలో రైతుల సౌకర్యార్థం రూ. 93.33 లక్షల నిధులతో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం, ప్రహరీ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. రైతులు పండించిన ధాన్యంను గోదాంలో నిల్వ చేసుకునేలా నిర్మాణ పనులు జరుగుతుండటంతో వారి చిరకాల వాంఛ నెరవేరినట్లైంది. ఇప్పటి వరకు సొసైటీకి గోదాం లేక రైతులు పండించిన పంటను తక్కువ ధరలకు అమ్ముకునేవారు. నేడు సొసైటీ అభివృద్ధి పథంలో పయనిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న చైర్మన్ నాగప్రసాద్‌రావు, రైతులు (ఫైల్)

సొసైటీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్నాం



సొసైటీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్నాం. రైతులందరి సహకారంతో ముందుకు వెళ్తున్నాం. గోదాం నిర్మించేందుకు స్థలం కొరత ఉండటంతో రూ.28 లక్షల వ్యయంతో స్థలం కొనుగోలు చేశాను. రైతుల చిరకాల కోరికను నెరవేర్చినందుకు సంతృప్తిగా ఉంది.

– బత్తినేని నాగప్రసాదరావు, చైర్మన్, నారాయణపురం

ఇబ్బందులు పడ్డాం.



ఇప్పటి వరకు గోదాం లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. పండించిన ధాన్యం నిలువ చేసుకునేందుకు కొత్తగా గోదాం నిర్మాణ పనులు జరుగుతుండడం చాలా సంతోషం. సొసైటీ అభివృద్ధి మార్గంలో నడుస్తుంది. సొసైటీ ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వామ్యులుగా ఉంటున్నాం.

– కాకాని హన్మంతరావు, రైతు, నారాయణపురం

వైద్యశిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొణిజర్ల: వైరాలోని బోడేపూడి భవన్ (సీపీఎం కార్యాలయం)లో ప్రతి నెలా మూడో ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరం ఆదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, డాక్టర్ రమణారెడ్డి.. దీర్ఘ కాలిక వ్యాధులైన బీపీ, షుగర్ వంటి వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, బొంతు సమత, గుడిమెట్ల రజిత, పాసంగులపాటి చలపతిరావు, అనుమోలు రామారావు, గుడిమెట్ల మోహనరావు, మాదినేని రజిని, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరక్ష మల్టీ స్పెషాలటీ ఆస్పత్రి సహకారంతో..

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని శ్రీరక్ష ఆస్పత్రి అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నగోపతిలో శ్రీరక్ష మల్టీ స్పెషాలటీ ఆస్పత్రి వారి సహకారంతో.. బుర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసన్ డాక్టర్ బుంగా కృష్ణ నేతృత్వంలో వైద్య సిబ్బంది ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జీడయ్య ప్రసాద్, వేలాద్రి, శంకరరావు, కరుణాకర్, శ్రీకాంత్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాలరీస్ సంస్థ ఆధ్వర్యంలో..



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కారేపల్లి: మండల పరిధిలోని సింగరేణి ప్రభావిత ప్రాంతం పోలంపల్లి గ్రామ పంచాయతీలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరాన్ని సింగరేణి కాలరీస్ ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ ఈసం కృష్ణయ్య ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు తిరుపతిరావు, భద్రునాయక్, నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది కవిత, ఫార్మసిస్టు సలీం తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి



బోనకల్: మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పక్కన నాయకులు

బోనకల్: ఈ నెల 24న హైదరాబాద్‌లో దివ్యాంగుల పెన్షన్ పెంపు, ఆసరా పెన్షన్లపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేపట్టిన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలకా నాగరాజు మాదిగ కోరారు. ఆదివారం బోనకల్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో కమిటీల ఏర్పాటు జరుగుతుందని.. జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి హనుమంతరావు, ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి వెంకటరత్నం, మండల అధ్యక్షుడు చిన్నసైదులు, నరసింహారావు, శ్రీను, గంగాధర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫించన్ల పెంపు హామీ నెరవేర్చాలి

ఎర్రుపాలెం: వృద్ధులు, దివ్యాంగులు, వితంతు ఫించన్ల పెంపు హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో పింఛన్‌దారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్లను పెంచకపోతే పేదలు కాంగ్రెస్ పార్టీకి దూరమవుతారన్నారు. ఈ నెల 24న ఖమ్మంలో నిర్వహించనున్న పింఛన్‌దారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రభాకర్‌మాదిగ, మండల ఇంచార్జ్ కిషోర్ మాదిగ, మండల కమిటీ అధ్యక్షులు సురేష్‌మాదిగ, ఆత్మారావు, జాన్‌మాదిగ, రమేష్‌మాదిగ తదితరులున్నారు.



అటెన్షన్ ప్లీజ్

బురద నీటిని తాగేదెలా..?



ఎన్టీఆర్ నగర్‌లో సంపుల్లోకి వచ్చిన బురదనీరు

సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో గత మూడు రోజులుగా తాగు నీటి సరఫరాలో బురద నీరు వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీటిని తాగేందుకు అవకాశం లేకుండా పోతుందని, వాడకానికి కూడా వీలు లేకుండా ఉన్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ నీరు వాడకం వలన దురదలు వస్తున్నాయని, అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సత్తుపల్లిటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి : కె.నర్సింహా, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

సెల్ నంబర్ : 8008801220

లయన్స్‌క్లబ్ ఉత్తమ అధ్యక్షుడిగా బెల్లంకొండ



అవార్డు అందుకుంటున్న బెల్లంకొండ

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఉత్తమ అధ్యక్షుడిగా బెల్లంకొండ ఆంజనేయులు ఎంపికయ్యారు. ఆదివారం నల్గొండలో.. ఆ జిల్లా గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ యాన్యువల్ అవార్డ్స్ సెలబ్రేషన్‌లో ఆంజనేయులుకు ఉత్తమ అవార్డు దక్కింది. ఉత్తమ థర్డ్ లయన్స్‌క్లబ్ తల్లాడ, ఉత్తమ థర్డ్ సెక్రటరీగా తల్లాడ లయన్స్‌క్లబ్ సెక్రటరీ కటికి వెంకటేశ్వర్లు అవార్డులు ప్రకటించారు. వీటితో పాటుగా మరో 9 అవార్డులు లయన్స్ క్లబ్ సభ్యులకు దక్కాయి.

శ్రీకాంతా చారి విగ్రహం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

సత్తుపల్లి: తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి వీరమరణం పొందిన శ్రీకాంతాచారి విగ్రహాన్ని సత్తుపల్లిలో స్థలం కేటాయించి ఏర్పాటు చేయాలని స్థానికులు.. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లను కోరారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడారు. విగ్రహ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో వెలిశాల నాగేంద్రాచారి, డీఎస్ చారి, ఎం.రామకృష్ణ, సత్యనారాయణ, మోహనాచారి, రాఘవాచారి, శ్రీహరి, ఏడుకొండలు, వెంకటేశ్వరరావు, ఏలేశ్వరి, పురుషోత్తం, కృష్ణమాచారి, ఏలేశ్వరం పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ



యోగా టీచర్ భారతిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రి కళాశాలలో నిర్వహించిన యోగా శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. గత 25రోజులుగా యోగా శిక్షణ ఇస్తున్న యోగా టీచర్ డాక్టర్ భారతిని.. పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కోర్సు ముగింపు సందర్భంగా బాలికలకు సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ఎన్‌సీసీ కోఆర్డినేటర్ రజిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు కేపీ ఐశ్వర్య, కె.రజిత, బి.రమ్య, సృజన తదతరులు పాల్గొన్నారు.

శత వసంతోత్సవం

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీకి చెందిన రమావత్ మంగమ్మ శత వసంతోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల సమక్షంలో మంగమ్మ 100వ పుట్టినరోజు వేడుకలను స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు హాజరై మంగమ్మ ఆశీస్సులు తీసుకున్నారు.

ఘనంగా బోనాల జాతర

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గ్రామదేవతలైన ముత్యాలమ్మ, బొడ్రాయి, ఆంజనేయస్వామి, మైసమ్మ గంగాలమ్మ, శ్రీమారెమ్మ అమ్మవార్లకు, పోతురాజు, శ్రీలక్ష్మీనర్సింహస్వామి లకు మహిళలు, చిన్నారులు ఆదివారం బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలో మహిళలు తమ ఇళ్లలో పాల పొంగళ్లతో బోనాలు తయారుచేసి ఎత్తుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పల్లకీ ఊరేగింపుతో, బోనాల జాతరతో గ్రామస్తుల నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



కల్లూరురూరల్: మారెమ్మతల్లికి బోనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి



మధిర: బోనాలతో వస్తున్న మహిళలు



సత్తుపల్లిటౌన్: బోనాలతో మహిళలు



ఎర్రుపాలెం: ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



ఏన్కూరు: తూతకలింగన్నపేటలో..

అసత్య ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న వీరమోహన్‌రెడ్డి, తదితరులు

తల్లాడ: కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు, అబద్దపు ప్రచారాన్ని మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. తల్లాడ మండలం నారాయణపురంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల హామీలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా కేసీఆర్, కేటీఆర్‌పై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకొని అసత్యపు ప్రచారం చేస్తున్నారనీ ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామప్రాజెక్ట్‌ను కేసీఆర్ హాయంలోనే 80 శాతం పూర్తి చేస్తే కాంగ్రెస్ తాము చేసినట్లు గొప్పలు చెప్పుకొటుందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కోటిరెడ్డి, చలపతిరావు, మురళీధర్‌రావు, రామిరెడ్డి, వీరకృష్ణ, యూసుఫ్, వెంకటేశ్వర్లు, కనకయ్య, చిన్న వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్లూరుకు ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏంటో చూపాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కల్లూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు అయినప్పటికీ ఎమ్మెల్యే మట్టా రాగమయి కల్లూరుకు చేసిన అభివృద్ధి ఏంటో చూపించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సవాల్ చేశారు. ఆదివారం కల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో.. మాజీ జెడ్పీటీసీ సభ్యులు కట్టా అజయ్‌కుమార్, డాక్టర్ లక్కినేని రఘులు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హయాంలో కల్లూరులో మినిస్టేడియం, 30పడకల ఆస్పత్రి, బస్‌స్టేషన్, నీటిపారుదల ఎస్‌సీ కార్యాలయం, షాదీకానాతో పాటు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వరరావు, భాస్కర్‌రావు, అంజయ్య, సూర్యనారాయణ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చూపుతాం..

ఏన్కూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చూపిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం అన్నారు. ఆదివారం స్థానిక కమ్మవారి కల్యాణమండపంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సారి మండలాల్లోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని, టీడీపీ అండతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె నెక్కి.. టీడీపీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలకు దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జనార్థన్, నాయకులు అప్పారావు, వరలక్ష్మి, రామయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారానికో ‘సారీ’

డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న రోడ్లు

- దుర్గంధం వెదజల్లుతున్న వైనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- డిప్యూటీ సీఎం ఆదేశాలు బేఖాతర్



బైపాస్ రోడ్డు పక్కనే వేసిన చెత్త



రోడ్డుపక్కనే దర్శనమిస్తున్న ఖాళీ మద్యం సీసాలు

మధిర: ఇళ్లలో ఉన్న చెత్తను ప్రతిరోజు సేకరించాల్సి ఉంది. కానీ చెత్తను సేకరించే కార్మికులు సరిపడా లేనందున, వాహనాలు మరమ్మతులకు గురికావడం, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెత్తను సేకరించే వాహనాలు వారానికోసారి వస్తున్న నేపథ్యంలో ఇళ్లలో చెత్త పేరుకుపోతుంది. చెత్త, వ్యర్థ పదార్థాలను ఇళ్లలో నిల్వ ఉంచలేక కొంతమంది రోడ్ల వెంబడి వేస్తున్నారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇంటి బైపాస్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా చెత్త వేయడం వల్ల దుర్గంధం వెదజల్లుతుంది. ప్రతిరోజు ఈ రోడ్డు మీదుగా హనుమాన్ కాలనీ, బురద రాఘవాపురం, ఎంప్లాయిస్ కాలనీ తదితర ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాదిమంది పురుషులు, మహిళలు ఈ రోడ్డు మీదుగా వాకింగ్ చేస్తుంటారు.

వెదజల్లుతున్న దుర్వాసన..

చెత్త, వ్యర్థ పదార్థాలు వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుంది. అదేవిధంగా ఖాళీ మద్యం సీసాలు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. ప్రతిరోజు ఇళ్లలో ఉన్న చెత్తను సేకరిస్తే ఈ దుస్థితి ఉండదు. కనీసం రెండు మూడు రోజులకు ఓసారి కూడా తీసుకెళ్లే పరిస్థితి లేదు. అదేవిధంగా విజయవాడ, రాయపట్నం, వైరా రోడ్లు తదితర ప్రధాన రహదారుల వెంబడి కూడా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తను పందులు, కుక్కలు చిందరవందరగా చేయడతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి.

డంపిగ్‌ను తలపిస్తున్నాయ్..

ఈ చెత్తకుప్పలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. కనీసం పట్టించుకునే నాధుడే లేడు. ఒక వైపు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, మురుగు సమస్యను తొలగించాలని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల కోసం రూ.128 కోట్లతో అభివద్ధి పనులు చేపడుతుండగా మరోవైపు అధికారుల నిర్లక్ష్యం కారణంగా డిప్యూటీ సీఎం లక్ష్యం నీరుగారి పోతుంది. అనేక సందర్భాల్లో ప్రతిరోజు చెత్తను సేకరించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని డిప్యూటీ సీఎం ఆదేశించినప్పటికీ ఆయన ఆదేశాలు మున్సిపల్ అధికారులు బేఖాతర్ చేస్తున్నారు.